## రెండు బోర్లేస్తే సుక్క నీరు రాలే..



నాకు ఆరు ఎకరాల పొలం ఉంది. వరి సాగు చేసిన. నీళ్లు లేక పంటలు ఎండి పోతున్నవి. రెండు బోర్లు వేస్తే సుక్కనీరు కూడా రాలే. పదేండ్లు బీఆర్ఎస్ సర్కారులో ఎన్నడూ ఇన్ని కష్టాలు పడలేదు. అప్పుడు అధికారులు, నాయకులు రైతుల బాగోగులు చూసేటోళ్లు. ప్రభుత్వం స్పందించి ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలి.

–తాయప్ప, రైతు, కేటీదొడ్డి
జోగుళాంబ గద్వాల జిల్లా

## పొలాలు ఎండుతున్నయి..



పోయినేడాది ర్యాలంపాడు కాల్వ నీళ్లు వొచ్చి వరి పంట పండించినం. ఈసారి కాల్వలన్నీ ఒట్టి పోయినయి. నాలుగెకరాల్లో వరిపంట సాగుచేసిన. బోర్లల్లో నీళ్లు వొస్తలేవు. పంట ఎండిపోతున్నది. చేసేది లేక పంటను పశువులు, గొర్లు మేయడానికి వదులుతున్నాం. అప్పు చేసి పెట్టుబడిన పెట్టినం. తెచ్చిన అప్పు లెట్లా కట్టాల్నో తెలుస్తలేదు.

– తిమ్మప్ప, రైతు, కేటీదొడ్డి
జోగుళాంబ గద్వాల జిల్లా



నీళ్లు అడుగంటిన మూసాపేట మండలంలోని నిజాలాపూర్ చెక్‌డ్యాం

# అడుగంటిన ఆశలు

- ఒట్టిబోతున్న ప్రాజెక్టులు
- బోరుబావుల్లో తగ్గిన జలం
- ఎండుతున్న వరి పొలాలు
- మండుతున్న రైతన్నల గుండె
- సాగునీళ్లులేక పంటలను పశువులకు మేపుతున్న కర్షకులు
- పదేండ్ల తర్వాత జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎన్కటిరోజులు

గట్టు/కేటీదొడ్డి, మార్చి 5 : పదేండ్ల తర్వాత మళ్లీ పాత రోజులు పునరావృతమవుతున్నాయి. 2014లో తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీరు, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో పెండింగ్‌తోపాటు కొత్త ప్రాజెక్టులు నిర్మించుకొని 24 గంటల నిరంతర కరెంట్ సరఫరా.. రైతుబంధు, సకాలంలో ఎరువులు, విత్తనాలను నాటి సర్కారు అందించడంతో వ్యవసాయం పండుగైంది. కానీ ఈ ఏడాది వర్షాలు అరకొరే పడడం.. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీటిమట్టం అడుగంటడం.. గత డిసెంబర్‌లో అనూహ్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. చోటు చేసుకున్నాయి. డిసెంబర్ నుంచే సాగునీటికి గడ్డుకాలం మొదలవుతూ వచ్చింది. యాసంగిలో సాగుకు నీటి సమస్య తీవ్రమవుతుండడంతో రైతుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. పలు చెరువుల్లో నీరు లేకపోవడంతో వరి పంట సాగుకు కష్టంగా మారింది. బోర్లల్లో భూగర్భజలాలు తగ్గడంతో ఆగి ఆగి నీటిని పోస్తున్నాయి. జనవరి, ఫిబ్రవరి నెలలో ఎత్తిపోతల ద్వారా కాల్వలు నిండుగా పారాల్సి ఉన్నా.. ఒట్టిబోయాయి. జూరాల, ఆర్డీఎస్ అధికారులు ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే ప్రకటించారు. గతంలో యాసంగి సీజన్‌లో పసిడి పంటలు పండించిన రైతులు ఆందోళనకు గురయ్యారు. బోర్ల కింద అరకొరగా వరి, ఇతర పంటలు సాగు చేసిన కర్షకులకు సైతం కరెంట్, నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీరు రాని పరిస్థితి. దీంతో చేసేది లేక పలువురు భూమి పుత్రులు వేసిన పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది పచ్చదనంతో కళకళలాడిన పంటలు.. ఈ ఏడాది నీళ్లులేక వాడుబడ్డాయి. గట్టు మండలం పెంచికలపాడు శివారులో రైతు ఉడుముల చిన్న హనుమంతు రెండు బోర్ల ఆధారంగా మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఆ పైరుకు రూ.వేల పెట్టుబడి పెట్టాడు. అయితే బోర్లు రోజురోజుకూ అడుగంటి పోవడంతో నీళ్లు చాలక రెండు ఎకరాల వరిపైరును ఎండగొట్టడానికి సిద్ధమయ్యాడు. మిగిలిన ఓ ఎకరా పైరు కూడా పండుతుందో లేదోననే బెంగతో ఉన్నాడు. ఈ క్రమంలో వరిపైరును గొర్లకు మేపడానికి ఇచ్చాడు.

అలాగే గతేడాది యాసంగిలో కేటీదొడ్డి మండలంలో 13 వేల ఎకరాలు వరి సాగైంది. ఈసారి మాత్రం కేవలం 6వేల ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేశారు. దిగుబడి గురించి ఆలోచిస్తే ఖర్చులకు కూడా చాలడం లేదని పెదవి విరుస్తున్నారు. ర్యాలంపాడు జలాశయం నుంచి సాగునీరు విడుదల కాకపోవడంతో చెరువులు, కుంటలు ఎండిపోయాయి. దీంతో ఉన్న బోర్లలో భూగర్భజలాలు అడుగంటుకున్నాయి. వేసిన బోర్లు సైతం నీళ్లు పోయకపోవడంతో రైతుల్లో యాసంగి సాగు పంటలపై సందిగ్ధం నెలకొంది. ఈసారి యాసంగి పంట దిగుబడులు గణనీయంగా తగ్గిపోయే ప్రమాదం ఉన్నది.

## కళతప్పిన చెక్‌డ్యాం

మూసాపేట, మార్చి 5 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద ఎత్తున చెక్‌డ్యాంలను నిర్మించింది. సాగునీరు పుష్కలమైంది. మూసాపేట మండలం సంకలమద్ది–నిజాలా పూర్ గ్రామాల శివారులో పారుతున్న పెద్దవాగుపై రూ.5 కోట్లతో చెక్‌డ్యాంను 2020 సంవత్సరంలో నిర్మించారు. దీంతో నిజాలాపూర్‌తో పాటు, మూసాపేట, సంకలమద్ది, మహ్మద్ హూస్సేన్‌పల్లి శివారులలో భూగర్భ జలాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. బావులు సైతం నిండుగా దర్శనమిచ్చాయి. ఎక్కడ చూసినా సాగు జలాలు సవ్వడి చేయగా.. బంగారు పంటలు పండాయి. అలాంటి నేల నేడు బీళ్లుగా మారింది. మొన్నటి దాకా జలకళ సంతరించుకున్న చెక్‌డ్యాం ఒట్టిబోతున్నది. నీటి ప్రవాహం లేక పెద్దవాగు వెలవెలబోతున్నది. తాగు, సాగునీటికి కష్టాలు మొదలయ్యాయి. వేసవి ప్రారంభంలోనే ప్రజలు నీటి కోసం తల్లడిల్లుతున్నారు.



కేటీదొడ్డి మండలం కొండాపురం శివారులో ఎండిన వరి



గద్వాల జిల్లా జంగంపల్లిలో తాగునీటి కష్టాలు



జంగంపల్లిలో బైక్‌పై బిందెలతో నీళ్లు తెస్తున్న యువకుడు

## కన్నీటి కష్టాలు

- జంగంపల్లిలో దాహం దాహం

జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగునీటితోపాటు తాగునీటికి తండ్లాట ప్రారంభమైంది. గతంలో ఎప్పుడూ లేనంతగా గత నెల నుంచే నీటి కష్టాలు షురూ అయ్యాయి. జంగంపల్లిలో అయితే సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతం. ఫిబ్రవరి ఒకటో తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగియడం.. తర్వాత ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టినా సమస్యపై దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కావడం లేదు.. దీంతో దాహార్తితో జనం తల్లడిల్లిపోతున్నారు. బిందెలు సైకిళ్లు, బైక్‌లకు కట్టుకొని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. మహిళలు బిందెలతో రోడ్లపైకి వస్తున్నారు. నీటి కోసం పడుతున్న బాధలు 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్ తన కెమెరాలో బంధించారు.

– ఫొటోగ్రాఫర్, జోగుళాంబ గద్వాల



గట్టు మండలంలోని పెంచికలపాడు శివారులో వరి పైరుకు నీళ్లులేక గొర్రెలను మేపేందుకు వదిలేసిన రైతు



వనపర్తి జిల్లా శ్రీనివాసపురం గ్రామ శివారులో నీళ్లు అడుగంటి ఒట్టిబోయిన లక్ష్మీకుంట



తెలంగాణ భవన్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న గులాబీ బాస్ కేసీఆర్



## మళ్లీ మన్నెకే..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- మళ్లీ అవకాశం కల్పించిన గులాబీ బాస్ కేసీఆర్
- వ్యూహాత్మకంగా పావులు కదిపిన అధినేత
- ఖంగుతిన్న అధికారపక్షం.. డైలమాలో కమలం

మహబూబ్‌నగర్, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ ఎంపీ స్థానానికి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డిని ఎంపిక చేశారు. సిట్టింగ్ ఎంపీకే మరోసారి ఛాన్స్ ఇవ్వడంతో అధికార పార్టీని ఇరుకున పెట్టినట్లయ్యింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంపీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించడంతో కాంగ్రెస్, బీజేపీలు గందరగోళంలో పడ్డాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా బరిలో నిలుపుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఆ పార్టీలో ప్రకంపనలు సృష్టించింది. మరోవైపు బీజేపీలో కూడా టికెట్ కోసం హోరాహోరీగా పోరు నడుస్తున్నది. మహబూబ్‌నగర్ స్థానానికి తొలి జాబితాలో చోటు దక్కకపోవడంతో ఆ పార్టీ నేతలు ఖంగుతున్నారు. ఇదిలా ఉండగా, మరో వారం పది రోజుల్లో దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ముందస్తుగా అభ్యర్థిని ప్రకటించడంతో కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. ఈసారి ఎలాగైనా ఎంపీ స్థానాన్ని దక్కించుకోవాలని పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. సిట్టింగ్ ఎంపీకి టికెట్ ఇవ్వడంతో పాలమూరు పార్లమెంట్ పరిధి పార్టీ నేతల్లో జోష్ పెరిగింది.

### కారుకు కంచుకోట పాలమూరు..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం గులాబీ పార్టీకి కంచుకోటగా మారింది. 2009, 2014, 2019 ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో పార్టీ అధినేత కేసీఆర్ పాలమూరు ఎంపీగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఇక్కడ సిట్టింగ్ ఎంపీగా ఉంటూనే 2014లో చిరకాల స్వప్నమైన తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించి పాలమూరు ప్రస్థానం చరిత్రలో నిలిచిపోయేలా చేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా పార్టీ అభ్యర్థి జితేందర్‌రెడ్డి అఖండ విజయం సాధించారు. ఆ తర్వాత పార్లమెంట్‌లో బీఆర్ఎస్ తరపున ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వెన్నుపోటు పొడవడంతో పార్టీ అధినేత కేసీఆర్ ఆయనకు టికెట్ నిరాకరించారు. దీంతో పారిశ్రామికవేత్త మన్నె సత్యనారాయణరెడ్డి సోదరుడు మన్నె శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయించడంతో గెలుపొందారు. ఐదేండ్లు పార్లమెంట్‌లో తనదైన శైలిలో సమస్యలపై గళమెత్తిన మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మరోసారి టికెట్ కేటాయించి బరిలో నిలుపుతున్నారు. విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ ఈ సారి కూడా హ్యాట్రిక్ సాధిస్తుందని పార్టీ క్యాడర్ ధీమా వ్యక్తం చేస్తున్నది.

### శ్రీనివాస్‌రెడ్డికి టికెట్‌తో కాంగ్రెస్ పార్టీకి చెక్..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి కేటాయించడం వెనుక గులాబీ బాస్ కేసీఆర్ పెద్ద వ్యూహమే రచించారు. సెట్టింగ్ ఎంపీగా ఉంటూ అందరినీ కలుపుకొని పోవడమే కాకుండా క్యాడర్‌కు ఎల్లవేళలా అందుబాటులో ఉండి మంచి పేరు సంపాదించారు మన్నె శ్రీనివాస్‌రెడ్డి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి కుటుంబంలో రాజకీయ చిచ్చుకు తెరలేపింది. ఆయన సోదరుడి కుమారుడు మన్నె జీవన్‌రెడ్డికి రాజకీయంగా పదవులు ఇస్తామని ఆశ చూపి పార్టీలో కలిశాక చివరకు మొండి చేయి చూపించారు. పార్లమెంట్ స్థానం ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఏకంగా తన సొంత నియోజకవర్గమైన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేకు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించి జీవన్‌రెడ్డి ఆశలపై నీళ్లు చల్లారు. మరోవైపు మన్నె జీవన్‌రెడ్డి రాకను షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. దీంతో ఆయనకు ఎంపీ టికెట్ నిరాకరించారు. రాబోయే ఎమ్మెల్సీ టికెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన ఇవ్వకపోవడంతో జీవన్‌రెడ్డి నిరాశలో ఉన్నారు. దీంతో మరోసారి సిట్టింగ్ ఎంపీకి కేసీఆర్ టికెట్ కేటాయించడంతో సొంత బాబాయ్ కోసం జీవన్‌రెడ్డి మళ్లీ కారెక్కే అవకాశం కనిపిస్తున్నది. మన్నె అభ్యర్థిత్వాన్ని మాజీ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇటు కాంగ్రెస్‌లో అభ్యర్థిత్వాని ఆశించి భంగపడ్డ నేతలు, బీజేపీలో టికెట్ ఆశించినా రాని పరిస్థితిలో ఉన్న డీకే అరుణ వర్గం వచ్చే ఎన్నికల్లో సైలెంట్‌గా ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఇది బీఆర్ఎస్‌కు కలిసి వస్తుందని కేసీఆర్ వ్యూహాత్మకంగా సిట్టింగ్ ఎంపికే టికెట్ కేటాయించడం జరిగిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## శివోహం..శివోహం



శ్రీశైలంలో స్వామిఅమ్మవారికి రావణ వాహనసేవ నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

- రావణ వాహనంపైఊరేగిన భ్రామరి మల్లికార్జునస్వామి
- ఓంకారనాదంతోపుల కించిన శ్రీగిరి క్షేత్రం

శ్రీశైలం, మార్చి 5 : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం చండీశ్వరపూజ, మండపారాధన, కలశార్చన, శివపంచాక్షరీ జపానుష్టానాలు, రుద్రపారాయణాలు, రుద్ర, చండీహోమం నిర్వహించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించిన రావణ వాహనంపై అక్కమహాదేవి అలంకార మండపంలో షోడశోపచార పూజలు చేశారు. మంగళవాయిద్యాలు డప్పుచప్పుళ్లతో క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. కళాకారుల జానపదాలు, ముంబాయి డోలు, కోలాటాలు, రాజభటుల వేషాలు, జాంజ్ పథక్, గొరవనృత్యం, బుట్టబొమ్మలు, బీరప్ప డోలు, నందికోళ్లసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, చెక్కబొమ్మలు వివిధ రకాల విన్యాసాలతో ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. అనంతరం కాళరాత్రి పూజ మంత్రపుష్పంతోపాటు స్వామి అమ్మవార్లకు ఆస్థానసేవ చేపట్టారు. రావణ వాహనాధీశుడైన స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారు కష్టాలనుంచి వీడి సుఖ సంతోషాలతో జీవిస్తారని ఆలయ స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ రెడ్డివారిచక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు, ధర్మకర్తలమండలి సభ్యులు విరూపాక్షయ్య, విజయలక్ష్మి, ఈఈలు రామకృష్ణ, నర్సింహారెడ్డి, మురళీధర్ రెడ్డి, ఏఈవోలు మోహన్, హరిదాస్, మల్లికార్జునరెడ్డి, స్వాములు, ఫణిధరప్రసాద్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్న పాల్గొన్నారు.

### మల్లన్నకు పట్టువస్త్రాలు..

శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్లకు కాణిపాక వరసిద్ధి వినాయక దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం కాణిపాకం ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశ్, అర్చక వేదపండితులు ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకోగా, శ్రీశైల దేవస్థానం చైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈవో పెద్దిరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రోచ్చారణల మధ్య పట్టువస్త్రాలను తలపై ఉంచుకొని స్వామిఅమ్మ వార్లకు సమర్పించారు.

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఆలయ మాడవిధిలోని భ్రామరీ కళావేదికతోపాటు పుష్కరిణి, శివదీక్షా శిబిరాల వద్ద అర్ధరాత్రి వరకు భక్తులు తిలకించేందుకు ఏర్పాటు చేసిన కూచిపూడి, భరతనాట్యం, హరికథ, బుర్రకథ, భక్తరంజని, నాటికలు వంటి కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయని పీఆర్‌వో తెలిపారు.

### ఎమ్మెల్సీకి తొలి నామినేషన్ దాఖలు

మహబూబ్‌నగర్, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఉపఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం తొలి నామినేషన్ దాఖలైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి ఎంపీటీసీ మంగి విజయ్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్‌కు అందజేశారు.

## జములమ్మ క్షేత్రం జనసంద్రం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

గద్వాల రూరల్, మార్చి 5 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చా రు. గర్భగుడిలో అమ్మవారిని చూసి భక్తజనం పరవశించి జములమ్మ తల్లీ కరుణించమ్మా అంటూ పూనకాలు, కేరింతలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ప్రస్తుతం పెండ్లిళ్ల సీజన్ కావడంతో నడిగడ్డ ప్రాంతంలో ప్రతి ఇంట్లో శుభకార్యానికి ముందు జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. దీంతో దర్శనానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే క్యూలో నిల్చున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్‌పర్సన్ గాయత్రి, ఈవో పురేందర్‌కుమార్ ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా గద్వాల రూరల్ ఎస్సై పర్వతాలు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు జానకీరాములు, ఓం ప్రకాశ్ కాంబ్లే, అభిలాష్, శంకర్, రాము, ఆలయ సిబ్బంది మురళీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, రవి ప్రకాశ్, రాజలింగం పాల్గొన్నారు.



జములమ్మఆ లయానికిభా రీగాత రలివచ్చినభ క్తులు

## బడికి ట్రాక్టరే దిక్కాయే..



ట్రాక్టర్‌లో పాఠశాలకువెళ్తున్న పచ్చర్ల గ్రామ విద్యార్థులు

రాజోళి, మార్చి 5 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండలం పచ్చర్లకు చెందిన విద్యార్థులు ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు గ్రామంలో చదువు అభ్యసించిన అనంతరం మాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8నుంచి 10వ తరగతి వరకు చదువుకునేందుకు 70 మంది వరకు విద్యార్థులు వెళ్లారు. పచ్చర్ల నుంచి మాన్‌దొడ్డి వెళ్లేందుకు 7కిలోమీటర్ల దూరం ఉండగా, ఉదయం 10గంటలకు రావాల్సిన ఆర్టీసీ బస్సు 11:30గంటలకు వస్తున్నది. ఒక్కోసారి బస్సు రాకపోకవడంతో కొందరు కాలినడకన వెళ్తుండగా, మరికొందరు చేసేది లేక బైక్‌లు, ఇతర వాహానాలను లిఫ్ట్ అడిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. దీంతో చేసేది లేక కొన్నాళ్లుగా గ్రామస్తులు ట్రాక్టర్ ద్వారా విద్యార్థులను తరలిస్తున్నారు. సమయానికి బస్సు సౌకర్యం కల్పించాలని గద్వాల డిపో మేనేజర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రెగ్యులర్‌గా బస్సు నడిపించాలని కోరుతున్నారు.

## ఉత్సాహంగా బండ్ల గిరక పోటీలు

- మొదటి స్థానంలో తెలంగాణ వృషభరాజము

అయిజ, మార్చి 5 : అంతర్రాష్ట్ర ఒంటెద్దు బండ్ల గిరక పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. పట్టణంలోని తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో మంగళవారం అంతర్రాష్ట్ర ఒంటెద్దు బండ్ల గిరక పోటీలు నిర్వహించారు. పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 21 వృషభరాజములు తరలివచ్చాయి. ఒంటెద్దు బండ్ల గిరక పోటీల్లో ధరూర్ మండలం మన్నాపురం గ్రామానికి చెందిన తిమ్మన్న వృషభరాజము 270.11 అడుగుల దూరం లాగి మొదటిస్థానంలో నిలువగా, కర్నూల్ జిల్లా కేంద్రంలోని బంగారుపేటకు చెందిన మద్దిలేటి వృషభరాజము 198 అడుగుల దూరంలాగి రెండోస్థానంలో నిలిచింది. మన్నాపురం గ్రామానికి చెందిన ఖలీం వృషభరాజము 187.7 అడుగుల దూరం లాగి మూడో స్థానంతో సరిపెట్టుకున్నది. వృషభరాజముల యజమానులకు ఆలయ కమిటీ సభ్యులు నగదు బహుమతులను అందజేశారు. పోటీలను తిలకించేందుకు రైతులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మొదటి స్థానంలో నిలిచిన మన్నాపురంవృష భరాజము

## భక్తిశ్రద్ధలతో కుంభాభిషేకం

- గద్వాల ఆర్డీవో ప్రత్యేక పూజలు

అలంపూర్, మార్చి 5 : కుంభాభిషేక మహోత్సవాల్లో రెండో రోజు యాగశాల మండపంలో మంగళవారం విశేషచండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఆలయంలో దర్శన విరామం ఉంటుందని పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యానాయుడు, అర్చకుడు ఆనంద్‌శర్మ తెలిపారు. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో యథావిధిగా పూజలు చేసుకోవచ్చన్నారు. గద్వాల ఆర్డీవో రాంచందర్ అలంపూర్ క్షేత్రాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్డీవో రాంచందర్ అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తాసీల్దార్ మంజుల, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ ఉన్నారు.

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
అంతర్జాతీయ మహిళా దినోత్సవం- 08-03-2024 (శుక్రవారం)
మహిళలకు ఉచిత వైద్య శిబిరం !!
06-03-2024 (బుధవారం) నుండి 09-03-2024 (శనివారం) వరకు ప్రతి రోజు ఉ: 9.00AM నుండి సా.4.00PM వరకు, ప్రసూతి మరియు స్త్రీ విభాగము, SVS హాస్పిటల్.
కాన్పులు మరియు స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలకు, తగు సలహాలు, సూచనలతో పాటు, శస్త్ర చికిత్సల కొరకు ఉచిత డాక్టర్ సంప్రదింపులతో, క్రింద తెలుపబడినవి వర్తించును.
1). గర్భవతులకు ANC-ROUTINE ఆంటినెటల్ స్కానింగ్. సాధారణ రక్త పరీక్షలు ఉచితంగా చేయబడును. BLOOD GROUPING, CBP + PLATELETS, CUE, RBS/GCT
2). స్త్రీ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి సాధారణ రక్త పరీక్షలు ఉచితంగా చేయబడును. • CBP+ PLATELETS, CUE, RBS, HIV, HBSAG, VDRL, HCV • అందరికి USG- అల్ట్రా సౌండ్ స్కాన్ ఉచితం. • PAP SMEAR ఉచితం.
3). రొమ్ములో గడ్డలు ఉన్న వారికి - మమ్మోగ్రఫీ ఉచితం.
4). అవసరమైన వారికి CERVICAL BIOPSY (కాల్పోస్కోపీ) ఉచితం.
5). CERVICAL CANCER PREVENTION VACCINE (CERVAVAC) SVSలో అందరికీ అందుబాటులో ఉంది.
6). సాధారణ కాన్పులు ఉచితం. 7). సిజేరియన్ ఆపరేషన్ రూ.6000/- (6-9 వ తేదీ వరకు మాత్రమే)
8). ఆరోగ్యశ్రీ వర్తించే శస్త్ర చికిత్సలకు పరీక్షలతో పాటు మందులు ఉచితం.
9). ఇతర శస్త్ర చికిత్సలకు తక్కువ ఖర్చుతో ఆపరేషన్ చేయబడును. మందులు పేషంట్లే భరించవలెను.
వివరాలకు ఈ మొబైల్ నంబరుపై
7893888529/6303444232 పై సంప్రదించగలరు.